# ఎర్రమల్లె

సత్యం శంకరమంచి

తెల్లగా చిరుపాపల్లా నిద్రపోతున్న మల్లె మొగ్గల్ని కుప్పచేసి దండ గుచ్చుతుంటే, సన్నటి సూది, చేపపిల్లలా జారి 'కసుక్కు'న వేలు కరిచింది. సూది గుచ్చుకున్న చోట ఉబికిన రక్తం, దానిమీద కొంచెం కొంచెం పెద్దదవుతున్న రక్తబిందువుని తుడిచి 'అయ్యో!' అనుకోటానికి మనసు రాలేదు. 'నాకేమీ తెలియదన్నట్లు' కొనకి నెత్తురు పూసుకుని కన్పించీ కన్పించకుండా నేల మీద పడుక్కుంది సూది. పెరిగి పెరిగి పెద్దదై, కుంకం బొట్టంతై, మధ్యాహ్న సూర్యుడంతైన నెత్తుటి చుక్కని తుడిచి వెయ్యలేక పోతోంది.

ఆ రంగు తనకు ప్రాణం అది తన శరీరపు రంగు, తనలో ప్రవహించే జీవప్రవాహపు రంగు, ఆ రంగు తొలినాటి చిన్నెలు కూడా తనకి నిషేధించి దూరం చేసినా తనని విడిచి పెట్టని రంగు, ఆ గాఢసత్వానికి బలి అయిన తనకు ప్రతినిధిగా నిలిచిన ఆ వర్ణం మీద తనకు జాలి - మమత, లోకంలోని ఏ వస్తువు మీద లేని అనురాగం - గుండె పిండి ఆ రంగుకి నైవేద్యం చేద్దామని కోరిక, కార్చే కన్నీరు ఆ రంగులో కార్చి ఋణం తీర్చుకుందామనే ఆకాంక్ష.

బిందువుగా నిలిచిన రక్తాన్ని గోటితో కల్యాణ తిలకంగా దిద్దుతోంది - సరిదిద్దుతోంది. జలతారు కాంతులు చిమ్ముతూ వాయువేగాన్ని మించి పగుగులు పెట్టే జోడు గుర్రాల్లాంటి కళ్ళు పూన్చిన విశాలమైన ఫాలభాగస్యందనం మీద ఠీవిగా స్వారీ చేసే సౌందర్యరూపమైన కల్యాణ తిలకానికి వన్నెలు తీరుస్తోంది తను చేయని నేరఫలంగా వచ్చిన శిక్షకి, కర్మపేరుతో జరిగిన అఘాయిత్యానికి ఫలించని తన అదృష్టానికి, తన నుంచి లాగివేయబడ్డ మూలధనానికి ఫలితంగా, స్వామిలేని దేవాలయంగా పువ్వు కోయబడి మిగిలిన తొడిమలా, పేలవంగా, కళాహీనంగా, తెల్లని తెల్ల కాగితంలా ఉన్న తన ముఖం చూడటం శుభప్రదం కాదని తొలగిపోయే లోకానికి తెలియకుండా, చాటుగా, ముంగిలి పొదల నీడన, ప్రకృతి ఇచ్చిన అభయముద్ర మాటున గుండె పులకలెత్తగా అందాలు అనుభవిస్తోంది.

కల్యాణ తిలకానికి కొసలుతీర్చి రూపమిచ్చింది. మహాసౌందర్యం నిగ్గులుతీరి నిలుచున్నట్లుగా ఉన్న ఆ రూపాన్ని చూసి నిశ్చేష్టురాలయింది.

ఒకనాడు లీలగా కొన్ని క్షణాలపాటు తన ముఖంమీద మెరిసి, తనలో జీవకళ నింపి, తన అందానికి పరిపూర్ణత నిచ్చి శాశ్వతంగా అంతర్ధానమైంది.

కల్యాణ తిలకంగా రూపొందిన రక్తం కదిలిపోయి రూపం మార్చుకుంటోంది - చెమ్మటకు చెదిరిన కుంకం బొట్టులా, చెరిగిన తన భాగ్యరేఖలా చెరిగిపోతున్న కల్యాణ తిలకాన్ని చూస్తుంటే మనసు విలవిలలాడ్తోంది. ఆలస్యం చేయకుండా వేలుని గట్టిగా కనుబొమ్మల మధ్య ఒత్తుకుని నుదుటి మీద తిలకం నిల్పుకుంది. కొలనులోకి వంగి చూసుకుంది. తన ముఖం - తను ఎన్నడూ చూసుకోని అందాలముఖం. ఆ ముఖంలో మన్మథబాణంలా నిలిచిన కల్యాణ తిలకం. తనను సర్వమంగళగా శుభప్రదగా నిల్పగలిగే మహత్తరమైన వస్తువు నుదుటి మీద వెలిగిపోతోంది.

కాంతులు వెలార్చే ఈ ముఖంతో అందరికీ స్వాగతం చెప్తుంది. సుఖాలకు ఆనందాలకు ఆటపట్టవుతుంది. శాంతికి సహృదయతకు వాకిళ్ళు తెరుస్తుంది. తన స్వామి పాదాలకు వంగి వందనం చేస్తుంది. నుదుటి మీద కల్యాణతిలకం లీలగా ఆ పాదాల కంటుకుంటుంది. అది ఆనందాల నిధిగా, శాశ్వత మంగళ ప్రదాయినిగా భాసిస్తుంది. తలెత్తి స్వామివైపు ఆనందంగా చూస్తుంది. స్వామి నీలి మబ్బులవంటి చేతుల్లో లేవనెత్తి తనని అక్కునచేర్చి లాలిస్తాడు. తను సిగ్గుల బరువై ఆ కౌగిలిలో ఒదిగిపోతుంది.

కొలనులో నీళ్ళు గాలికి జలజల కదిలాయి. కల తొలగిపోయింది. కదులుతున్న నీళ్ళలో తన నుదుటిమీది తిలకం నాట్యం చేస్తోంది. తన మనసు ఆనందంతో ఊగిసలాడుతూ గాలికంటె తేలికై తేలిపోతోంది. తన ముఖంలో సిగ్గు దొంతరలు తనే చూడలేక చరాలున ముఖం మల్లె పొదలవైపు తిప్పుకుంది.

సంపంగి వాసనలు పరుగెత్తుకొచ్చి గిలిగింతలు పెట్టాయి. జాజీ మొగ్గలు సంతోషంగా తలలెగురవేశాయి. వికసించిన గులాబీలు గుండెనిండుగా నవ్వి ఆనందించాయి. ఇంతటి సంతోషాన్ని తట్టుకోలేక తూలిపోతోంది. తల వాల్చేసుకుంది.

దండ కట్టని మల్లెపూలు బిక్క మొహం పెట్టి పలకరించాయి. ఇప్పటి దాకా వాటి సంగతే మర్చిపోయినందుకు నొచ్చుకుని దండ గుచ్చటం మొదలెట్టింది.

ఆకాశాన పెద్ద మబ్బు పక్కనే ఒక చిన్ని మబ్బు నడిచి వెళ్తోంది. ఆ చిన్ని మబ్బు లేకపోతే ఆ మేఘానికి అంత అందం లేదనుకుంది. చెట్టుమీద పిట్టల జంట ముక్కులు రాసుకుంటూ రెక్కలు దువ్వుకుంటున్నాయి. ఆడపిట్టకి కోపమొచ్చి కాబోలు దూరంగా జరిగి వెళ్ళటం చూసి తనలో తను నవ్వుకుంది.

ఈనాడు తన మనసు సంతోషంతో నిండిపోయింది. తన ముఖంమీద కల్యాణ తిలకం దీపంలా వెలుగుతోంది. మల్లెదండ సిగలో తురుముకుని తన ఆనందాన్ని అపారం చెయ్యాలి. నల్లటి ఆకాశంలాంటి కురుల్లో కుప్పపోసిన నక్షత్రాల్లా, తన సౌందర్యాన్ని శ్లాఘించే కావ్యంలో అక్షరాల్లా వెలిగాలి. ఇంతటి మహదానందాన్ని పొందబోయే గుండె ఆత్రంగా కొట్టుకుంది. రక్తం వేగంగా ప్రవహించింది. తను సూది గబగబా ఆడించింది.

మల్లెదండ తల్లో పెట్టుకోబోయింది. అక్కడ మల్లెపూలు లేవు. తెల్లటి మల్లెలు నెత్తురు పులుముకుని ఎర్రటి పూలయ్యాయి. కొన్ని వందల సూదిపోట్లు తిన్న చెయ్యి రక్తం చిమ్ముతోంది. గుండె నీరైంది. ఆకాశంవైపు చూసింది. అక్కడ పెద్ద మబ్బులో చిన్న మబ్బు కలిసిపోయింది. పిట్ట లెక్కడికో ఎగిరిపోతే చెట్టు బోసిపోయింది. కొలను నీళ్ళలో తన ముఖంమీద కల్యాణతిలకం జారిపోయి కన్నీళ్ళలో కలిసిపోవటం కన్పించింది. ఎర్రగా నిప్పుకణాల్లో ఉన్న మల్లెపూలను పిచ్చిగా తల మీద పోసుకుంది. ప్రవహిస్తున్న రక్తాన్ని ముఖమంతా పులుముకుంది.

నీళ్ళలో ఏవో నీడలు కదిలాయి. రేగిన కార్చిచ్చులా, ముక్కంటి మంటలా, విలయాగ్ని కీలలా—

ఇల తప్పక వలె విలువైన పుస్తకం!
నేడే ఒక పుస్తకం కొనండి!
ఆదర్శాలకై అల్లాడిన అఖండ గాయకుడు.



సంగీతమే సర్వస్వమని, కన్నవారిని కాదని, ఇల్లూ వాకిలీ వదలి, ఆలూ బిడ్డలతో కాని దేశాలు వెళ్ళి పడి పులుపాట్ల అద్భుత నవల.
(కన్నడం నుంచి)
రూ. 1.00

దక్షిణ భాషా పుస్తక సంస్థ ఆదరంతో ప్రకటితం
మీ మామూలు బుక్ షాపుల్లో కొనండి
లేదా మాకు వ్రాయండి.
ఆంధ్రప్రదేశ్
బుక్ డిస్ట్రిబ్యూటర్స్,
రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాదు.